సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం : 15 : జూలై : 2023



'జల ప్రళయానికి' ఏడాది

గతేడాది జూలై 13, 14, 15, 16 తేదీల్లో భద్రాచలం వద్ద గోదావరి ఉధృతరూపం దాల్చింది.

8లో



...ఉద్యమాలే శరణ్యం

ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారమవుతాయని గ్రామీణ పేదల సంఘం పేర్కొంది.

8లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉన్నది.

న్యూస్‌రీల్

గాజులతో అలంకరణ



గాజుల చీరలో అమ్మవారు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుర్రాల చెరువు గ్రామ శివారులో స్వయంభూగా వెలిసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించారు. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన గుడిపాటి గోపాలరావు, స్రవంతి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారిని గాజులతో చేసిన చీరతో అలంకరించగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని వివిధ రకాల పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం అర్చకులు పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వేదపండితుడు పద్మనాభశర్మ, అర్చకులు పురాణం రవికుమార్ శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు ఎస్వీఆర్ కే.ఆచార్యులు, కిలారు నాగమల్లేశ్వరరావు, చింత నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు డిజిటల్ పరికరాలు..

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని చర్ల మండలంలో 36 అంగన్‌వాడీ కేంద్రాలకు డిజిటల్ పరికరాలు, ఆట వస్తువులు సమకూర్చేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన సంస్థల నుంచి టెండర్ల ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పొట్రు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ నంబర్, బ్యాంక్ ఖాతా కలిగిన అన్ని జిల్లాల వారు ఈ టెండర్లలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఐటీడీఏలోని కార్యనిర్వాహక ఇంజనీర్ (గిరిజన సంక్షేమ శాఖ) కార్యాలయంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు టెండర్ షెడ్యూళ్లు పొందవచ్చని తెలిపారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అదే కార్యాలయంలో టెండరు దాఖలు చేయాలని, అనంతరం అదే రోజు టెండరు తెరుస్తామని వివరించారు.

తగ్గుతున్న గోదావరి

భద్రాచలంటౌన్: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో స్వల్పంగా పెరిగిన గోదావరి తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రం నది నీటిమట్టం 19.1 అడుగులుగా నమోదైంది. ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ రాత్రికి 18.5 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టుల్లో సైతం ఇన్‌ఫ్లో తగ్గడంతో గోదావరి నీటిమట్టం మరింత తగ్గే అవకాశం ఉన్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

దుమ్ముగూడెం : దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని బి.సులోచనా రాణి ఆదేశించారు. శుక్రవారం ఆమె కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటి సంవత్సరం అడ్మిషన్లపై ఆరా తీశారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి మెరుగుపర్చాలి

- ఐటీసీ విస్తరణ ప్రజాభిప్రాయ సేకరణలో వక్తల సూచన
- ఉద్యోగాల్లో గిరిజనులకు న్యాయం దక్కలేదని పలువురి ఆవేదన
- కాలుష్యంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- ప్లాంట్ విస్తరణకు సానుకూలంగా మెజారిటీ ప్రజానీకం
- పరిశ్రమలను కాపాడుకోవాలన్న విప్ రేగా కాంతారావు



సభకు హాజరైన ఎంపీ కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే పాయం, మాజీ ఎమ్మెల్సీ బాలసాని తదితరులు

బూర్గంపాడు: సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ ఎనిమిదో యూనిట్ ఏర్పాటుకు మెజారిటీ వర్గాల నుంచి సానుకూల స్పందన వచ్చింది. ఇదే సమయంలో కాలుష్య నియంత్రణ అంశంలో, ప్లాంటులో ఉపాధి కల్పించే విషయంలో కొన్ని ప్రజా సంఘాలు సూటిగా తమ అసంతృప్తిని వ్యక్తం చేశాయి. మరోవైపు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ వేదిక లోపలకు అనుమతించలేదని కొందరు యువకులు ఆందోళన వ్యక్తం చేశారు.

మెజారిటీ అనుకూలం

భద్రాచలం పబ్లిక్ పాఠశాలలో శుక్రవారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రవీందర్ ఆధ్వర్యంలో ఈ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఇందులో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు, రైతులు పాల్గొని మాట్లాడారు. వేదికపై తమ అభిప్రాయాలను తెలిపేందుకు 47 మందికి అవకాశం ఇచ్చారు. ఇందులో 41 మంది పరిశ్రమ విస్తరణకు అనుకూలంగా తమ అభిప్రాయం తెలిపారు. సంస్థ నుంచి తాము ఏం ఆశిస్తున్నామో వివరించారు. మిగిలిన ఆరుగురు ఏజెన్సీ చట్టాల అతిక్రమణ, గిరిజనులకు ఉపాధి కల్పనలో ఐటీసీ మొండిచేయి చూపుతోందన్నారు. మరికొందరు లిఖితపూర్వకంగా తమ డిమాండ్లను తెలియజేశారు.

స్వాగతించాలి : రేగా

షెడ్యూల్ ఏరియాలో ఉండే 1/70 చట్టాల కారణంగా మన దగ్గర పరిశ్రమలు నెలకొల్పేందుకు సంస్థలు ఆసక్తి చూపించడం లేదని, ఉన్న సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని స్థానిక ఎమ్మెల్యే, విప్ రేగా కాంతారావు అన్నారు. పరిశ్రమలు వస్తేనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఐటీసీ.. ఏపీ రేయాన్స్ (బిల్ట్)ను టేకోవర్ చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని, ఇప్పటికే మంత్రి కేటీఆర్‌తో పలు దఫాలుగా చర్చించనట్టు వివరించారు. పరిశ్రమల స్థాపన సందర్భంగా కొందరు వ్యక్తులు చీటికి మాటికి న్యాయస్థానాలను ఆశ్రయిస్తుంటారని, దాని వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదంటూ కాంతారావు పేర్కొన్నారు. పరిశ్రమల నుంచి వెలవడే కాలుష్యం విషయంలో అభ్యంతరాలు ఉంటే, బ్యాలెన్స్ చేయాలి తప్పితే, పరిశ్రమలను అడ్డుకోవద్దని సూచించారు. వైరాలో నెలకొల్పిన ఓ పరిశ్రమను ఎత్తేసిన తీరును ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు.

ప్రజారోగ్యంపై బాధ్యతగా..

మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధిని ప్రతి ఒక్కరూ స్వాగతించాలన్నారు. అదే సమయంలో ప్రజారోగ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మాజీ ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తాటి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ ఐటీసీ విస్తరణకు మద్దతు తెలిపారు. ఇదే సమయంలో ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్యం కోసం మల్టీ స్పెషాలిటీ వైద్యశాల ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి వృత్తివిద్యా కోర్సులను ప్రారంభించాలన్నారు. రాజకీయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని, జామాయిల్, సుబాబుల్ కర్రకు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. రైతులకు ఉచితంగా మొక్కలు ఇవ్వటంతో పాటు నేరుగా ఐటీసీయే కర్రను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



ఐటీసీ పీఎస్‌పీడీ విస్తరణ ప్రజాభిప్రాయ సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

> **మెగా రైతు రేగా..**
>
> ప్రజాభిప్రాయ సేకరణలో విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ 'ఎమ్మెల్యేగా కాకుండా ఒక రైతుగా నేను మాట్లాడుతున్నాను. నా మాటలు కొందరికి నచ్చవచ్చు. నచ్చకపోవచ్చు. కానీ ఐటీసీ పరిశ్రమను నమ్ముకుని నేను 60,70 ఎకరాల్లో జామాయిల్ సాగు చేస్తున్నాను. నాలాగే ఎందరో ఐటీసీని నమ్ముకుని ఉన్నారు' అని పేర్కొన్నారు. రేగా ప్రసంగం కొనసాగుతుండగానే డెబ్బై ఎకరాల్లో జామాయిల్‌ను సాగు చేస్తున్నారంటే మిగిలిన పంటలు ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారో ? ఏమో? టీచర్‌గా ప్రస్థానం మొదలుపెట్టి ఎమ్మెల్యేగా ఎన్నికైన రేగా కాంతారావు ఇప్పుడు మెగా రైతుగా మారిపోయాడంటూ ఈ సభకు హాజరైన జనం చర్చించుకున్నారు.

చాన్నాళ్లకు కనిపించిన ఎంపీ కవిత

ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా స్థానిక ఎంపీ మాలోత్ కవిత జిల్లా ప్రజలకు దర్శనం ఇచ్చారు. గడిచిన ఏడాది కాలంగా ఆమె భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు దూరంగా ఉంటున్నారు. ఎక్కువగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోనే పర్యటనలు, అధికారిక కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. దీంతో స్థానిక బీఆర్ఎస్ నాయకత్వానికి, ఎంపీకి మధ్య గ్యాప్ ఏర్పడిందనే భావన సైతం నెలకొంది. ఈ నేపథ్యంలో ఎంపీ కవిత ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకావడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇకనైనా భద్రాద్రి జిల్లాకు సంబంధించిన సమస్యలపై ఎంపీ ఫోకస్ పెట్టాలంటూ అక్కడికి వచ్చిన ప్రజలు కోరారు.

> **కాలుష్యంపై శ్వేత పత్రం ప్రకటించాలి**
>
> తెలంగాణ జనసమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పంపన శివకుమార్ మాట్లాడుతూ ఐటీసీ విడుదల చేస్తున్న వ్యర్థాల వల్ల జల, వాయు కాలుష్యాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలియజేస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముద్దా పిచ్చయ్య మాట్లాడుతూ 7వ యూనిట్ విస్తరణ సమయంలో 259 ఎకరాల్లో గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. జామాయిల్ సాగుతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని గిరిజన సమాఖ్య నాయకులు గన్నెబోయిన శ్రీను ఆరోపించారు. సంస్థలో 1,250 మంది పర్మనెంట్ కార్మికులు ఉండగా ఇందులో గిరిజనుల సంఖ్య కేవలం 50కే పరిమితమైందన్నారు. షెడ్యూల్ ఏరియాలో ఇంత తక్కువ సంఖ్యలో గిరిజన ఉద్యోగులు ఉండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చివరిగా ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్‌హెడ్ సిద్దార్థ మొహంతి మాట్లాడుతూ ఐటీసీ విస్తరణకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు హాజరై తమ అభిప్రాయాలను తెలిపిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్టర్‌గా ప్రియాంక

- హైదరాబాద్‌కు బదిలీ అయిన అనుదీప్
- ఐటీడీఏ నూతన పీఓగా ప్రతీక్ జైన్
- సెర్ప్ సీఈఓగా వెళ్తున్న గౌతమ్ పొట్రు
- ఎన్నికల వేళ మొదలైన బదిలీలు



కలెక్టర్‌గా నియమితులైన ప్రియాంక అల



భద్రాచలం ఐటీడీఏ నూతన పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలం/సూపర్‌బజార్ (కొత్తగూడెం): ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. దీంతో జిల్లా నూతన కలెక్టర్‌గా 2016 బ్యాచ్‌కు చెందిన ప్రియాంక అల నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆమె గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అడిషనల్ కమిషనర్‌గా పని చేస్తున్నారు. 2021లో జరిగిన గ్రేటర్ ఎన్నికలను సమర్థంగా నిర్వహించిన అధికారిగా ఆమె పేరు తెచ్చుకున్నారు. అంతకు ముందు ఆమె యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రత్యేక అధికారిగా పనిచేశారు. కలెక్టర్‌తోపాటు భద్రాచలం -ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా ఉన్న గౌతమ్ పొట్రు సైతం బదిలీ అయ్యారు. సెర్ప్ సీఈఓగా గౌతమ్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా ఉన్న ప్రతీక్ జైన్‌ను నియమించింది. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

ట్రైనీగా మొదలుపెట్టి..

సివిల్స్ పరీక్షల్లో జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన దురిశెట్టి అనుదీప్ జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా తొలిసారి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత ఇక్కడే స్థానిక సంస్థలకు అడిషనల్ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈ రెండు పోస్టుల్లో జిల్లా అంతటా ఆయన విస్తృతంగా పర్యటించారు. అశ్వారావుపేట దగ్గర కొండరెడ్లపై ప్రత్యేకంగా పరిశోధన చేశారు. వారి జీవిత స్థితిగతులను దగ్గరుండి పరిశీలించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. గతేడాది రికార్డు స్థాయిలో వరదలు వచ్చినప్పుడు కలెక్టర్ హోదాలో అనుదీప్ చేసిన కృషికి సర్వత్రా ప్రశంసలు దక్కాయి. డెబ్బై అడుగులకు పైగా గోదావరి వరద వచ్చినా ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ సహాయక కార్యక్రమాలు చేపట్టారు. వీటితోపాటు గతేడాది డిసెంబరులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనను విజయవంతం చేశారు. రాష్ట్ర గవర్నర్, సీఎంలు ఒకేసారి జిల్లాలో పర్యటించినా ప్రొటోకాల్ సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

పోడు పట్టాలు..

గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న భద్రాద్రి జిల్లాలో పోడు రైతులకు పట్టాలను అతి తక్కువ సమయంలో అందివ్వడంలో కలెక్టర్‌గా అనుదీప్ ఎంతో శ్రమించారు. సుమారు లక్షన్నర వరకు వచ్చిన దరఖాస్తులను వడబోసి కేవలం రెండున్నర నెలల సమయంలో లక్షన్నర ఎకరాలకు సంబంధించి యాభై ఐదు వేల పట్టాలను తయారు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశారు. అదనపు గంటలు పని చేశారు. ఎంతో జటిలంగా మారిన పోడు పట్టాల పంపిణీని ప్రజల నుంచి పెద్దగా వ్యతిరేకత రాకుండానే విజయవంతంగా పూర్తి చేయగలిగారనే భావన ప్రజల్లో నెలకొంది. మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలను మెరుగుపరచడంలోనూ తనదైన ముద్ర వేశారు. అశ్వారావుపేట, ఇల్లెందు, చర్ల, మణుగూరు వైద్యశాలలను ఆధునీకరించటంతోపాటు వైద్యులను నియమించి వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ముఖ్యంగా చర్ల, అశ్వారావుపేట ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడానికి వ్యక్తిగతంగా కూడా చొరవ చూపించారు. ఆయన కలెక్టర్‌గా ఉన్న సమయంలో జిల్లాకు స్వచ్ఛ సర్వేక్షణ్, ఆరోగ్య పంచాయతీ, జలసంరక్షణ విభాగంలో జాతీయ అవార్డులు వరించాయి.

సెర్ప్ సీఈఓగా గౌతమ్ పొట్రు

భద్రాచలం ఐటీడీఏ పీఓగా పనిచేస్తున్న గౌతమ్ పొట్రు సెర్ప్ సీఈఓగా బదిలీ అయ్యారు. 2020, ఆగస్టు 7న పీఓగా గౌతమ్ బాధ్యతలు స్వీకరించారు. గిరిజనాభివృద్ధికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించటంలో కృషి చేశారు. కాగా గిరిజన దర్బారులో అందుబాటులో లేకపోవడం, గిరిజన గ్రామాల్లో క్షేత్ర స్థాయి పర్యటనలు లోపించటం వంటి అపవాదులను ఆయన మూటగట్టుకున్నారు.

కల్లూరు ఆర్డీఓగా శివాజీ

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)గా ఉన్న శివాజీని కల్లూరు ఆర్డీఓగా బదిలీ చేశారు. గతంలో ఆయన భద్రాచలం ఆలయ ఈఓగా పని చేశారు.

రాపిడ్ సర్వే చేయాలి

పాల్వంచరూరల్: ఏజెన్సీ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి రాపిడ్ సర్వే నిర్వహించాలని, రక్త నమూనాలను సేకరించాలని డీఎంహెచ్‌ఓ శిరీష వైద్యసిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని చంద్రాలగూడెం, మామిడిగూడెం, మల్లారం గ్రామాలతోపాటు ఉల్వనూరు పీహెచ్‌సీని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో పలు ఇళ్ల తిరిగి జ్వరాలపై ఆరా తీశారు. నివాసాల్లో నీరు నిలవ లేకుండా చర్యలు తీసుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. బాధితుల నుంచి శాంపిల్స్ సేకరించి టీహబ్ సెంటర్‌కు పంపి పరీక్షలు చేయించాలని, ఈ సీజన్‌లో ఒక్క డెంగీ కేసు కూడా నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఉల్వనూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్విని, సబ్ యూనిట్ ఆఫీసర్ జేతురాం ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



చంద్రాలగూడెంలో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శిరీష

కొత్తగా పోడు పట్టాలు రావు : ఎఫ్‌డీఓ

చండ్రుగొండ : కొత్తగా పోడు కొడ్తే పట్టాలొస్తాయనేది అవాస్తమని ఫారెస్టు డివిజనల్ అధికారి అప్పయ్య పేర్కొన్నారు. మండల కేంద్రం చండ్రుగొండలోని ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇకపై రిజర్వ్‌ఫారెస్టును పోడు పేరిట నాశనం చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. అడవిని నాశనం చేసే వారి, ప్రోత్సహించే వారి పేర్ల జాబితా ఇప్పటికే రూపొందించామని తెలిపారు. వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు దక్కకుండా కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని, బైండోవర్ కేసులు నమోదు చేస్తామని వివరించారు. తిప్పనపల్లి గ్రామశివారులోని నాలుగు ఎకరాల్లో ప్లాంటేషన్ ధ్వంసం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, నిందితులను గుర్తించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రేంజి ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌ఓ ప్రసాదరావు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పూర్తి

- ఓటరు నమోదుకు కొత్తగా 6,571 మంది గుర్తింపు
- జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఓటరు జాబితా పరిశీలన, నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపు ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఎన్నికల ప్రధాన అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 5.1.2022 నుంచి 5.2.2023 మధ్య కాలంలో తొలగించిన ఓటరు జాబితా విచారణ ప్రక్రియ పూర్తి చేయాలని తహసీల్దార్లకు సూచించారు. 29 వేల ఓట్లు తొలగించామని, వాటిలో 18 వేలకు సంబంధించి విచారణ ప్రక్రియ పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన 11 వేల ఓట్లపై విచారణ చేయాల్సి ఉందని అన్నారు. ఈ విచారణ ప్రక్రియను ఇతర జిల్లాల తహసీల్దార్ల ద్వారా క్రాస్ చెకప్ చేస్తున్నామని తెలిపారు. ఈవీఎంల వినియోగంపై జిల్లా ఎన్నికల అధికారి, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలతోపాటు మొబైల్ వాహనాలు ఏర్పాటు చేసి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. నమూనా పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎన్నికల సమయంలో తీసుకునే అన్ని జాగ్రత్తలను తీసుకోవాలని, వీవీ ప్యాట్ స్లిప్పులను భద్రపర్చాలని వివరించారు. ఇంటింటి సర్వే ప్రక్రియలో భాగంగా జిల్లాలోని 3,69,685 గృహాల విచారణ ప్రక్రియ పూర్తయిందని, ఈ విచారణలో 6,571 మంది నూతన ఓటర్లుగా నమోదు కావడానికి అర్హత ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఓటుహక్కు కల్పించే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఓటరు జాబితాలో రెండు ఫొటోలు ఒకేలా ఉన్నవి 18,438 గుర్తించి తొలగించామని అన్నారు. విచారణలో అర్హత ఉన్న 378 మందికి ఓటు హక్కును కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బూత్‌స్థాయి అధికారుల నుంచి పోలింగ్ కేంద్రాల వారీగా రెండు ఓట్లు కలిగిన ఓటర్లు లేరని ధ్రువీకరణ తీసుకోవాలని వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇల్లెందు, భద్రాచలం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు శివాజీ, రత్నకళ్యాణి, మణుగూరు, ఇల్లెందు, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గ కేంద్రాల తహసీల్దార్లు నాగరాజు, కృష్ణవేణి, విల్సన్, రామకృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సురేష్‌కుమార్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇదేం తిరకాసు?

- పనితీరు, నాలుగేళ్ల సర్వీసు పూర్తయితేనే రెగ్యులరైజేషన్
- ని'బంధనాల'తో ఆందోళన చెందుతున్న జేపీఎస్‌లు
- జిల్లాలో 374 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

చుంచుపల్లి: రెగ్యులరైజ్ చేస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శు(జేపీఎస్)లకు ఆశ పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు నిబంధనల పేరుతో ఆందోళనకు గురిచేస్తోంది. నాలుగేళ్ల సర్వీసు, పనితీరు ఆధారంగా పర్మనెంట్ చేస్తామని తాజాగా సర్కారు కిరికిరి పెట్టిందని జేపీఎస్‌లు వాపోతున్నారు. వీరిని 2019, ఏప్రిల్ 12న ప్రభుత్వం నియమించింది. మొదట మూడేళ్ల కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాల్లో నియమించుకోగా, పని ఒత్తిడి కారణంగా చాలా మంది మధ్యలోనే మానేశారు. మానేసినవారి స్థానంలో నాలుగైదు విడతలుగా కొత్తవారిని తీసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో 374 మంది పనిచేస్తున్నారు. గతేడాది ప్రభుత్వం జీఓ–26 ద్వారా ప్రొవిజన్ కాలాన్ని మరో ఏడాది పెంచగా, ఈ ఏడాది ఏప్రిల్ వరకు ముగిసిపోయింది. దీంతో తమను రెగ్యులరైజ్ చేయాలని గత ఏప్రిల్ 28 నుంచి 16 రోజులపాటు జేపీఎస్‌లు సమ్మెకు దిగారు. సమ్మె విరమించకపోతే ఉద్యోగాల్లోంచి తీసేస్తామని ప్రభుత్వం హెచ్చరించడంతో మే 13న తిరిగి విధుల్లో చేరారు. ఆ తర్వాత జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో ఆశలు రేకెత్తాయి.

తాజాగా కిరికిరి!

నాలుగేళ్ల ప్రొవిజన్ కాలాన్ని పూర్తి చేసుకున్నవారినే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఈ నేపథ్యంలో విధివిధానాల తయారీకి అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నవారి వివరాలు సేకరిస్తున్నారు. కాగా జిల్లాలో 374 మంది జేపీఎస్‌లు ఉండగా, నాలుగేళ్ల ప్రొవిజన్ సర్వీస్ పూర్తి చేసినవారు 260 మంది ఉన్నారు. జిల్లా కమిటీల ద్వారా జేపీఎస్‌ల పనితీరును కూడా ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. నిర్దేశిత లక్ష్యాల్లో మూడింట రెండో వంతు పూర్తి చేసిన వారికి మాత్రమే క్రమబద్ధీకరణలో అవకాశం కల్పిస్తామని పేర్కొంది. ఈ కొత్త నిబంధనలతో జేపీఎస్‌లు అయోమయానికి గురవుతున్నారు. బేషరతుగా అందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నాలుగేళ్లు పూర్తైనవారినే రెగ్యులరైజ్ చేస్తే తమ పరిస్థితి ఏమిటని మిగిలిన వారు ఆవేదన చెందుతున్నారు. ఈ లోపు ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే ప్రక్రియ నిలిచిపోతుందని, ఆ తర్వాత వచ్చే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు.

పనితీరు ప్రాతిపదికనే రెగ్యులరైజేషన్..

పనితీరు ఆధారంగా రెగ్యులరైజేషన్ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ బాధ్యతలను జిల్లా కమిటీలకు అప్పగించింది. కమిటీలో కలెక్టర్, అదనపు కలెక్టర్, డీపీఓ, అటవీశాఖ అధికారితో పాటు మండల స్థాయి అధికారి ఒకరు ఉంటారు. జేపీఎస్‌లు విధుల్లో చేరిన నాటి నుంచి హాజరు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు, క్షేత్రస్థాయిలో వారి ప్రవర్తన, పథకాల అమలు తీరు, ప్రజలకు అందించిన సేవలు వంటి సుమారు 10 అంశాల వారీగా వారి పనితీరు పరిశీలించనున్నారు. ఆ తర్వాత ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు.

పథకాల అమలులో కీలకంగా..

విధుల్లో చేరినప్పటి నుంచి తాము ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నామని, ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ సైతం పలు సందర్భాల్లో ప్రశంసించారని జేపీఎస్‌లు గుర్తుచేస్తున్నారు. గ్రామాలకు జాతీయ అవార్డులు రావడంలో జేపీఎస్‌ల పాత్ర కీలకంగా ఉందని కొనియాడారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూలు, హరితహారం, పారిశుద్ధ్యం, నర్సరీ, వైకుంఠధామం, డంపింగ్ యార్డుల నిర్వహణ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఇంటి నిర్మాణ అనుమతులు వంటి పనులను వీరు నిర్వర్తిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తూ ప్రశంసలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో నిబంధనలు లేకుండా అందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు.

> **నిబంధనలు లేకుండా..**
>
> 
>
> ప్రభుత్వం జేపీఎస్‌ల పనితీరును కొలమానికంగా పెట్టడం సరికాదు. దీని వల్ల కొందరు ఆందోళనకు గురవుతున్నారు. గ్రామాల అభివృద్ధిలో మూడు, నాలుగేళ్లుగా విశేషంగా కృషి చేస్తున్న జేపీఎస్‌లను రెగ్యులరైజేషన్ చేయాలి. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికీ అవకాశం కల్పించాలి.
>
> – వంశీకృష్ణ, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

> **ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం..**
>
> 
>
> జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 2019 నుంచి జేపీఎస్‌ల వ్యవస్థ కొనసాగుతోంది. ప్రస్తుతం 374 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం నడుచుకుంటాం.
>
> –లక్ష్మీరమాకాంత్, డీపీఓ

క్లుప్తంగా

తాలిపేరుకు తగ్గిన వరద

చర్ల: తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్‌లోకి వరద ఉధృతి తగ్గింది. రెండు రోజులుగా ఎగువ ప్రాంతంలో భారీగా వర్షాలు కురవడంతో 12న ఏడు గేట్లను ఎత్తి 7,579 క్యూసెక్కులు, 13న రెండు గేట్లను ఎత్తి 2,131 క్యూసెక్కుల చొప్పున వరద నీటిని దిగువకు విడుదల చేశారు. గురువారం రాత్రి నుంచి ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రస్తుతం ఒక్క గేటును మాత్రమే ఎత్తి ఉంచి 562 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 71.93 మీటర్లుగా నీటి మట్టాన్ని కొనసాగిస్తున్నారు. ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 730.941 ఎంసీఎఫ్‌టీ కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 177.423 ఎంసీఎఫ్‌టీ మేర సాగునీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి క్రమేపీ ఇన్‌ఫ్లో తగ్గినట్లయితే ప్రస్తుతం తెరిచి ఉన్న ఒక గేటును కూడా పూర్తిగా మూసి వేసి పూర్తిస్థాయిలో ప్రాజెక్ట్‌లో సాగునీటిని నిల్వ చేయనున్నారు.

పోడు పట్టాల కోసం హైకోర్టులో పిటిషన్



హైకోర్టును ఆశ్రయించిన మహిళలు

సుజాతనగర్: పోడు పట్టాల పంపిణీలో తమకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చిట్టిరామవరం ప్రాంతానికి చెందిన ఇద్దరు గిరిజన మహిళలు హైకోర్టులో శుక్రవారం రిట్ పిటిషన్ దాఖలు చేశారు. మండలంలోని గరీబ్‌పేట బీట్ పరిధిలోని 20వ సర్వే నంబర్‌లో పోడుపట్టాల కోసం బానోత్ హిరాలీబాయి, బానోత్ బీజాబాయి దరఖాస్తు చేసుకున్నారు. కాగా బీజాబాయికి 0.7 గుంటలకు హక్కు పత్రం రాగా.. హిరాలీకి అసలే రాలేదు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ మహిళలు కోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా బాధితుల పక్షాన సీపీఎం జిల్లా నాయకులు గుగులోత్ ధర్మా మాట్లాడుతూ.. మహిళలకు ఒక్కొక్కరికీ 3.30 గుంటల చొప్పున పోడు పట్టా రావాల్సి ఉందన్నారు. గతంలో చెట్టు పట్టా ఇచ్చిన ఆధారాలు ఉండగా ఇప్పుడు పట్టా ఇవ్వకపోవడం తగదన్నారు. పోడు పట్టాల పంపిణీ పారదర్శకంగా జరగలేదని ఆయన ఆరోపించారు.

భద్రాద్రి క్రీడాకారులకు బంగారు పతకాలు



క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్: జాతీయస్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భద్రాద్రి క్రీడాకారులు రెండు బంగారు పతకాలు సాధించారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోగాల శ్రీనివాసరెడ్డి శుక్రవారం వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా రాజాంలో ఈ నెల 12 నుంచి మొదలై 16 వరకు జరిగే పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భద్రాచలం పట్టణంలోని సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులు సత్తా చాటారని తెలిపారు. మహమ్మద్ అబ్బాస్ 83 కేజీల విభాగంలో, గాలి రామ్మోహన్‌రావు 105 కేజీల విభాగంలో బంగారు పతకాలు సాధించారని, పలువురు క్రీడాకారులు, ప్రముఖులు అభినందనలు తెలిపారని ఆయన వివరించారు.

కవి యాకూబ్‌కు సాహిత్య అకాడమీ చైర్మన్ పరామర్శ



యాకూబ్‌ను పరామర్శిస్తున్న గౌరీశంకర్, తదితరులు

కారేపల్లి: మండలంలోని రొట్టమాకురేవుకు చెందిన కవి యాకూబ్ తల్లి హురాంబీ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈమేరకు ఆయనను తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ శుక్రవారం పరామర్శించారు. ఈసందర్భంగా హురాంబీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఇంకా కేయూ పాలక మండలి సభ్యుడు సీతారాంతోపాటు ప్రసేన్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని ఆంబజార్‌కు చెందిన ఎం.రాధిక తన భర్త నాగరాజు కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నాగరాజుపై వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేశ్ శుక్రవారం తెలిపారు.

ఇరిగేషన్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్

సత్తుపల్లి: సత్తుపల్లిలోని ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దీంతో విద్యుత్ మీటర్‌లో మంటలు చెలరేగగా సిబ్బంది స్పందించి ఆర్పివేశారు. అయితే, కార్యాలయ గదిలోని కొన్ని రికార్డులు పాక్షికంగా దగ్ధమయ్యాయని ఏఈ వెంకట్ తెలిపారు.

జల ప్రళయానికి ఏడాది

- పునరావాస శిబిరాలకు తరలిన వేలాదిమంది నిరాశ్రయులు
- భద్రాద్రి వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన ఆ 'మూడు రోజులు'
- అప్పటి పరిస్థితిని తలుచుకుంటేనే ఉలికిపడుతున్న ఏజెన్సీ
- గోదావరి పరిసర ప్రాంత ప్రజలను వెంటాడుతున్న 'ఆగస్టు' భయం



గత ఏడాది జూలైలో స్లూయిజీల లీకేజీతో రామాలయాన్ని చుట్టిముట్టిన గోదావరి వరద (ఫైల్)

భద్రాచలం: భద్రాచలం ఏజెన్సీ అతలాకుతలమైంది. వేలాది మంది నిరాశ్రయులుగా మారారు. వందలాది ఎకరాల పంటలు వరదలో మునిగిపోయాయి. ప్రభుత్వ అధికారులకు కంటి మీద కునుకులేకుండా పోయింది. భద్రాచలం వద్ద గోదావరి చరిత్రలో రెండో అతి పెద్ద వరద సంభవించింది. ఆ విషాద సంఘటనకు ఏడాది కావొస్తోంది. ఆ రోజులు తలుచుకుంటేనే ఏజెన్సీ వాసులు ఉలికిపడుతున్నారు. మళ్లీ వర్షాకాలం, ముంపు సీజన్ రావడంతో ఈసారి ఎటువంటి ప్రమాద హెచ్చరికలు వినాల్సి వస్తుందోనని కలవరపడుతున్నారు.

అర్ధరాత్రి 71.3 అడుగులకు గోదావరి..

భద్రాచలం వద్ద గోదావరి వరదలు ఆగస్టులో ఎక్కువగా వస్తుంటాయి. గత ఏడాది మాత్రం వర్షాకాల సీజన్ ప్రారంభంలోనే విస్తారంగా వర్షాలు కురవడంతో జూలైలోనే వరద పోటెత్తింది. దీంతో భద్రాచలానికి ఎగువన ఉన్న ప్రాజెక్టులు నిండి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో నీటిని దిగువకు వదిలారు. గతేడాది జూలై 13న మొదటి, రెండు, మూడో ప్రమాద హెచ్చరికలను దాటి గోదావరి ఉధృతంగా ప్రవహించింది. 13న అర్ధరాత్రి సమయంలో 56.30 అడుగులుగా నమోదైంది. 14న ఉదయం తగ్గినట్టే తగ్గి మధ్యాహ్నం నుంచి వేగంగా పెరిగింది. 14వ తేదీ అర్ధరాత్రి 64.7 అడుగులు నమోదైంది. ఇక 15వ తేదీన ఏజెన్సీ వాసులకు గోదావరి జల ప్రళయాన్ని చూపించింది. రికార్డు స్థాయిలో 15వ తేదీ అర్ధరాత్రికి 71.3 అడుగులకు నమోదు కావడంతో అటు ఏజెన్సీ, భద్రాచలం వాసులకే కాక.. ఇటు అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేసి 'కాళరాత్రి'గా మారింది. 16వ తేదీ నుంచి క్రమంగా తగ్గుముఖం పట్టింది.

బాధితులను పరామర్శించిన సీఎం కేసీఆర్

గోదావరి వరదల ముంపుతో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు మండలాల్లో వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. సుమారు 25 వేల మంది రాత్రికి రాత్రే నిరాశ్రయులుగా మారి పునరావాస శిబిరాల్లో తలదాచుకున్నారు. హఠాత్తుగా వచ్చిన వరదలతో తొలుత తడబడిన అధికారులు అనంతరం యుద్ధప్రాతిపదికన రక్షణ చర్యలను చేపట్టారు. శ్రీరామనవమి ఉత్సవాలకు సైతం భద్రాచలం వైపు కన్నెత్తి చూడని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వరద బాధితులకు అండగా ఉండేందుకు గతేడాది జూలై 17న భద్రాచలం వచ్చారు. నన్నపనేని మోహన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలో ముంపు బాధితులను కలిసి 'నేనున్నానంటూ' అభయమిచ్చారు. అనంతరం ఐటీడీఏలో జరిగిన సమావేశంలో వివిధ మండలాలకు జిల్లా అధికారులను నియమించి, శాశ్వత పరిష్కారానికి రూ.1,000 కోట్లను ప్రకటించారు. తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి పది వేల రూపాయలను ప్రకటించి అందచేశారు. వరదలు తగ్గాక అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి వారం రోజుల్లోనే పరిస్థితిని సాధారణస్థితికి తీసుకొచ్చారు.

పొంచి ఉన్న ఆగస్టు భయం



గత ఏడాది వరదలతో భద్రాచలంలో నీటమునిగి సుభాష్‌నగర్ కాలనీ

ఈ ఏడాది జూలై రెండు వారాలు పూర్తి కావస్తున్నప్పటికీ సాధారణ వర్షాలే నమోదయ్యాయి. దీంతో గోదావరిలో నీరు ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. ఆగస్టులో గోదావరిలో అత్యధికంగా వరదలు సంభవించాయి. అత్యధికంగా 1986, ఆగస్టు 16న 75.6 అడుగులు, 1990లో 70.8 అడుగులతో ఏజెన్సీలో గ్రామాలను ముంచెత్తింది. కేంద్ర జలవనరుల శాఖ లెక్కల ప్రకారం 1976 నుంచి 2022 వరకు 35 సార్లు గోదావరి నీటి ప్రవాహం మొదటి ప్రమాద హెచ్చరికను దాటగా అందులో ఆగస్టులోనే అత్యధికంగా 18 సార్లు ఉధృతంగా ప్రవహించింది. ఇదే భయం ప్రస్తుతం ఏజెన్సీ వాసులను వెంటాడుతోంది. ముంపు గ్రామాల రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించాలంటే జంకుతున్నారు. దీంతో వర్షాకాలం సీజన్ వెళ్లిపోయేదాక ముంపు బాధితులు, రైతులు బిక్కుబిక్కుమంటూనే కాలం వెళ్లదీసే పరిస్థితి నెలకొంది.

భారీగా ఎస్‌ఐల బదిలీలు

- ఖమ్మం, భద్రాద్రి, మానుకోట జిల్లాల్లో 41 మందికి స్థానచలనం
- అంతే సంఖ్యలో జిల్లాలకు కేటాయింపు

ఖమ్మంక్రైం: త్వరలో ఎన్నికలు జరగనున్న అన్ని శాఖల్లో బదిలీల కోలాహలం నెలకొంది. ఈమేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో 41మందికి ఎస్సైలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిని మళ్లీ ఇవే జిల్లాలకు కేటాయించారు. ఆయా జిల్లాల్లో రిపోర్ట్ చేశాక అక్కడి అధికారులు పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఈమేరకు ఖమ్మం జిల్లా నుంచి 21మంది ఎస్సైలు, మహబూబాబాద్ జిల్లా నుంచి 9మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 11మందికి స్థానచలనం కలగగా, వీరిలో ఖమ్మంకు 19మందిని, మహబూబాబాద్‌కు 11మందిని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 11మందిని కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. కాగా, ఖమ్మం కమిషనరేట్ నుంచి బదిలీ అయిన ఎస్సైల్లో సోమా సతీష్, మాచినేని రవి, బాణాల రాము, గంజి స్వప్న, బానోతు మహేష్, ఎం.డీ.మౌలానా, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఎల్.శ్రీనివాసరావు, మేడా అప్పారావు, ఎండీ.అబ్దుల్‌ఘనీ, ఎం.డీ.అబ్దుల్ రషీ, ఉస్మాన్ అలీ, రాఘవయ్య, ఎం.వెంకటేశ్వర్లు, డి.కుమారస్వామి, రవూఫ్, సత్తార్, బాణాల వెంకటాచారి, షేక్ మదార్, ఎం.డీ.యాకూబ్, బి.గిరిధర్‌రెడ్డి ఉన్నారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి డేనియల్ ప్రభుదాస్, ఎం.డీ.ఖాసింఖాన్, ఏ.రాజేందర్, ఈ.రాజేష్, ఏ.భాగ్యరాజ్ వంశీకృష్ణ, కె.శ్రావణ్‌కుమార్, వి.రామ్మూర్తి, టి.లచ్చయ్య, జూకంటి వెంకటేశ్వర్లు, చల్లా అరుణ్ బదిలీ అయ్యారు. ఇంకా మహబూబాబాద్ జిల్లాకు చెందని ఎస్సైలు భద్రునాయక్, మొగిలి, వెంకటరాములు, బి.సతీష్, పి.ప్రవీణ్‌కుమార్, ఎం.లింగారెడ్డి, ఎం.డీ.అలీం హుస్సేన్, వి.ఉమాకాంత్, షేక్ మహమూద్‌ను బదిలీ చేసి ఖమ్మం కమిషనరేట్‌కు కేటాయించారు.

కాంగ్రెస్ వస్తే చీకటి రాజ్యమే..

నిరసన ప్రదర్శనలో ఎమ్మెల్యే వెంకటవీరయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర, పక్కన నాయకులు, రైతులు, చిత్రంలో డీజిల్ మోటార్

తల్లాడ: రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే చీకటి రాజ్యమేనని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఇటీవల ఉచిత విద్యుత్ టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ శుక్రవారం తల్లాడలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈసందర్భంగా రెడ్డెం వీరమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో 9 గంటల కరెంట్ సరఫరా చేసినా తరచుగా కోతలే ఉండేవని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు నిరంతరాయంగా 24 గంటలపా రైతులకు విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. కాగా, అధికారంలోకి వస్తే రూ.4వేల పింఛన్ ఇస్తామని ప్రకటించిన రాహుల్‌గాంధీ.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ.2 వేలు ఇస్తున్నట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. కాగా, తల్లాడలో ఆందోళన సందర్భంగా వినూత్న నిరసన తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రైతాంగం ఇబ్బందులు పడిందని చెబుతూ డీజిల్ మోటార్లు, గుడిసెల్లో రాత్రివేళ లైట్లతో కాపలా ఉన్నట్లుగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకటశేషగిరిరావు, ఎంపీపీ దొడ్డా శ్రీనువాసరావు, నాయకులు డి.వెంకట్‌లాల్, డి.భద్రరాజు, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, కోసూరి వెంకటనరసింహారావు, గుండ్ల వెంకటి, దగ్గుల శ్రీనివాసరెడ్డి, ముద్దా మురళి, శీలం కోటారెడ్డి, కేతినేని చలపతిరావు, మోదుగు ఆశీర్వాదం, కోడూరి వీరకృష్ణ, దిరిశాల దాసురావు, తూము శ్రీనువాసరావు, ఆదూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భద్రాచలంలో 'ఆపరేషన్ ముస్కాన్'


భద్రాచలంటౌన్: పోలీస్ అధికారులు ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్ల రోడ్‌లో ఓ దుకాణంలో బాలుడు పని చేస్తున్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించి అవగాహన కల్పించారు. దుకాణ యజమాని ముకేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముస్కాన్ కేసు నమోదు..

విద్యుత్‌కార్యాలయం ప్రాంతానికి చెందిన ఓ టిఫిన్ సెంటర్ యజమాని అలీముద్దీన్ ఓ బాలుడిని తన హోటల్‌లో పనికి పెట్టుకున్నాడు. శుక్రవారం ముస్కాన్ టీం సభ్యులు తనిఖీ చేయగా బాలుడు హోటల్‌లో పని చేస్తూ ఉండటాన్ని గమనించారు. బాలుడిని పని నుంచి విముక్తి కల్పించి, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు.

విద్యార్థిపై చేయి చేసుకున్న వార్డెన్

విచారించిన డీడీ సత్యనారాయణ



వసతిగృహంలో విచారిస్తున్న డీడీ సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ వసతి గృహాల్లో విద్యార్థులపై వార్డెన్లు, సిబ్బంది చేయిచేసుకోవడం పరిపాటిగా మారింది. ఇటీవల నేలకొండపల్లి మండలం చెరువుమాదారం ఎస్సీ వసతి గృహంలో ఓ విద్యార్థిని అక్కడ పనిచేసే వర్కర్ కర్రతో కొట్టగా.. ఖమ్మంలోని ఎస్సీ ఆనందనిలయం బాలుర వసతి గృహం విద్యార్థిని వార్డెన్ కొట్టిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఆనందనిలయంలో పదో తరగతి చదువుతున్న రాజు, ఇతర విద్యార్థులు పరస్పరం వార్డెన్‌కు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో వార్డెన్ రాజును మెడపై చేతితో కొట్టగా ఆయన చేతి కడియం చెవిపై తాకింది. దీంతో విద్యార్థి తండ్రి శుక్రవారం సాయంత్రం వసతిగృహానికి వచ్చి వార్డెన్‌ను నిలదీశాడు. అనంతరం విద్యార్థిని ఆస్పత్రికి తీసుకెళ్లి మందులు ఇప్పించాక హాస్టల్‌కు తీసుకొచ్చాడు.

ఘటనపై విచారణ..

విద్యార్థిపై వార్డెన్ చేయి చేసుకున్న ఘటనపై ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ శుక్రవారం రాత్రి విచారించారు. వార్డెన్ తను కొట్టాడని విద్యార్థి ఫిర్యాదు చేయగా.. ఎందుకు కొట్టావో చెప్పాలని వార్డెన్‌ను డీడీ ప్రశ్నించారు. అయితే, విద్యార్థులు పరస్పరం నెట్టుకుని తనకు ఫిర్యాదు చేయడంతో చేయి వేశానే తప్ప కొట్టలేదని వార్డెన్ బదులిచ్చాడు. కాగా, నెట్టేసుకోవడం, చేతులు వేసుకోవడం వంటివి ఎక్కడ నేర్చుకున్నాడని డీడీ ప్రశ్నించగా.. వర్కర్లు తమపై అలాగే చేస్తున్నారని చెప్పడం గమనార్హం. ఈ విషయమై డీడీ సత్యనారాయణను వివరణ కోరగా, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులపై చేయి చేసుకునే హక్కు ఉండదని తెలిపారు. ఆనంద నిలయం విద్యార్థిపై వార్డెన్ చేయి చేసుకున్న ఘటనపై విచారిస్తున్నామని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి వార్డెన్‌కు మెమో ఇవ్వడంతోపాటు సస్పెన్షన్ కోసం కలెక్టర్‌కు లేఖ రాస్తానని తెలిపారు. కాగా, ఎస్సీ వసతిగృహాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వార్డెన్లు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో రెండు హాస్టళ్లలో నెల వ్యవధిలోనే ఇలాంటి ఘటనలు జరగడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జూలూరుపాడు: అనారోగ్యం కోసం చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పోటు గణేశ్ కథనం ప్రకారం.. మండలంలోని కరివారిగూడెంకాలనీకి చెందిన కొర్రా చందూలాల్ (45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకునేందుకు డబ్బు లేకపోవడంతో కొంత మంది వద్ద అప్పు తీసుకున్నాడు. అప్పు చేసిన డబ్బుతో వైద్యం చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదు. ఒక వైపు అనారోగ్య సమస్య, మరో వైపు అప్పుల గురించి మనస్తాపం చెంది పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చందూలాల్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య కొర్రా లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గణేశ్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

బూర్గంపాడు: గోదావరి బ్రిడ్జిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు గ్రామానికి చెందిన బొడ్డె రోహిత్, హైమావతి దంపతులతో పాటుగా అదే గ్రామానికి చెందిన తొర్రెం శ్రీనివాస్ ముగ్గురు ద్విచక్ర వాహనంపై గురువారం భద్రాచలం వచ్చారు. ఇక్కడ పనులు ముగించుకుని తిరుగుపయనమైన క్రమంలో భద్రాచలం – సారపాక మధ్యన గోదావరి బ్రిడ్జిపై వారు వెళ్తున్న మోటార్‌సైకిల్ అదుపుతప్పింది. ఒక్కసారిగా బ్రేక్ వేయటంతో హైమావతి(28) రోడ్డుపై పడిపోయింది. ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వెంటనే భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. మృతురాలి తండ్రి వెంకటి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ నాగయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని తానీషా కల్యాణ మండపం వెనుక ఖాళీ ప్రదేశంలో సుమారు 35 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సుమారు నాలుగు రోజుల కిందట మృతి చెందంతో మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అదించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో ఢీకొనడంతో చిన్నారి మృతి

ఇంటి ముందు ఆడుకుంటుండగా ప్రమాదం

ఏన్కూరు: ఆటో ఢీకొట్టిన ఘటనలో చిన్నారి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని జంగాల కాలనీకి చెందిన దుగ్గిరాల యోక్షశ్రీ(15 నెలలు) ఇంటి ముందు ఆడుకుంటుండగా అదే కాలనీకి చెందిన మహేష్ ఆటోతో అతి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన చిన్నారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. అంత సేపు కళ్ల ముందు ఆడుకున్న చిన్నారి విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా రోదించారు. ఘటనపై చిన్నారి తండ్రి నర్సింహారావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాదావత్ రవి తెలిపారు.

రాష్ట్రపతి భవన్ సందర్శించిన జిల్లా ప్రజాప్రతినిధులు



ఎంపీని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు నేతృత్వాన ఢిల్లీ వెళ్లిన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు శుక్రవారం రాష్ట్రపతి భవన్‌ను సందర్శించారు. ఆ తర్వాత వారు ఎంపీని సన్మానించి పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావుతో పాటు నాయకులు బండి పుల్లారావు, బోయినపల్లి సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో కేటీఆర్ రాక

- బస్ డిపో, ఇతర అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం
- విలేకరుల సమావేశంలో ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ



సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రియ

ఇల్లెందు: ఇల్లెందు నియోజకవర్గంలో కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాల కోసం ఎదురు చూస్తున్నాయని, ఇందుకోసం వచ్చే నెలలో మంత్రి కేటీఆర్ ఇల్లెందుకు రానున్నారని ఎమ్మెల్యే హరిప్రియ తెలిపారు. వారం రోజులపాటు హైదరాబాద్‌లో మంత్రులు, అధికారులను కలిసి వచ్చిన ఆమె శుక్రవారం ఇల్లెందులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రానున్న నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల కళ ఇల్లెందు బస్ డిపో చివరి దశకు చేరిందన్నారు. మల్టియుటిలిటీ సెంటర్, మోడల్ మార్కెట్, లేక్ వ్యూ పార్క్, ఇతర పనులను ప్రారంభించాల్సి ఉందన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలో రూ.1600 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మున్సిపాలిటీలోనే రూ.120 కోట్లతో పనులు సాగుతున్నాయని అన్నారు. త్వరలో 100 పడకల ఆస్పత్రికి జీఓ విడుదల అవుతుందని, ఐటీఐ కాలేజీ ఏర్పాటుకు సీఎం హామీ ఇచ్చారని, కరెంటాఫీస్ వద్ద ఖమ్మం రోడ్‌కు రూ.10 కోట్లతో డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు చేపడతామని వివరించారు. దళితబంధుకు 1,100 మంది, బీసీ రుణాలకు 300 మందిని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మామిడిగుండాల, సులానగర్‌లో 13 వేల ఎకరాల భూములకు విముక్తి లభిస్తుందన్నారు. కొమరారం మండలం కోసం కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు వెళ్లాయని, బోడు మండలానికి ప్రతిపాదన వెళ్లాల్సి ఉందన్నారు. గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పులిగళ్ల మాధవరావు, శ్రీనివాసరెడ్డి, శీలం రమేష్, కె. రేణుక, లక్ష్మణ్‌నాయక్, కృష్ణారెడ్డి, బొమ్మెర హరిప్రసాద్, ధనమ్మ, కార్తీక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలే శరణ్యం

గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రయ్య



సభలో మాట్లాడుతున్న దండా లింగయ్య

ఇల్లెందు: విప్లవ ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారమవుతాయని, భూస్వామ్య విధానం రద్దు, దున్నేవాడికే భూమి, వ్యవసాయ విప్లవం ద్వారానే పీడిత ప్రజల రాజ్యం సాకారమవుతుందని యూసీసీఆర్ఐ (ఎంఎల్) అనుబంధ గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ ఎర్రయ్య తెలిపారు. శుక్రవారం గ్రామీణ పేదల సంఘం, యూసీసీఆర్(ఎంఎల్), ఓపీడీఆర్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని గోవింద్‌సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐతా ఫంక్షన్ హాల్లో భారత విప్లవోద్యమ నిర్మాతలు దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎర్రయ్య మాట్లాడుతూ.. భారత విప్లవోద్యమ రథసారథులు డీవీ, టీఎన్‌లు జనతా ప్రజాతంత్ర విప్లవ బాటలో విప్లవోద్యమాన్ని నిర్మించారని తెలిపారు. డీవీ, టీఎన్‌లు చూపిన మార్గమే భారత విప్లవానికి శరణ్యమని పేర్కొన్నారు. ఓపీడీఆర్ రాష్ట్ర నాయకుడు దండా లింగయ్య మాట్లాడుతూ.. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో పేదలు లేని దేశంగా అభివృద్ధి సాధించలేకపోయామని తెలిపారు. భూస్వాముల ఆధీనంలో లక్షల ఎకరాలున్నాయని, పేదలు మాత్రం సెంటు భూమి కోసం పోరాడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పోలెబోయిన ముత్తయ్య, షేక్ సోందుమియా, వేప వెంకన్న, జక్కం శ్రీను, కల్తీ లెనిన్, పల్లెసుద్దుల శ్రీను, చంద్రమోహన్, పాపారావు, రాము, నందు, ఉపేందర్, సత్యనారాయణ, శ్రీను, నాగేశ్వరరావు, శ్రీకాంత్, కుమారి, రేణుక, శాంతి, చొప్పదండి బాలకృష్ణ పాల్గొన్నారు. నవోదయ సాంస్కృతిక సంస్థ కళాకారుల గీతాలు అలరించాయి.



ఏసీజేగా జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి

సాక్షి, హైదరాబాద్: తాత్కాలిక సీజే జస్టిస్ నవీన్‌రావు శుక్రవారం పదవీ విరమణ చేయడంతో ఆ పదవీ బాధ్యతలను సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి స్వీకరించనున్నారు. జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి.. శనివారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. కొత్త ప్రధాన న్యాయమూర్తికి కేంద్రం అనుమతి ఇచ్చి, బాధ్యతలు అప్పగించేంతవరకు జస్టిస్ షావిలి ఏసీజేగా కొనసాగనున్నారు.


వలంటీర్లలో క్రిమినల్ శక్తులున్నాయి: పవన్



సాక్షి ప్రతినిధి, ఏలూరు/తణుకు టౌన్ : వలంటీర్లలో కొన్ని క్రిమినల్ శక్తులు న్నాయని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మరో సారి తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో అనేక వ్యవస్థ లు ఉన్నప్పుడు వలంటీర్లతో సమాంతర వ్యవస్థ నడపటం ఎందుకని ఆయన ప్రశ్నించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో వారాహి విజయయాత్రలో పవన్ మాట్లాడుతూ నాసిరకం మద్యం అమ్ముతున్నారన్నారు.

చెప్పుతో కొట్టేవారు లేకే వలంటీర్లు ప్రశ్నలడుగుతున్నారు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి : చెప్పు తీసుకుని కొట్టేవారు లేకే ప్రభుత్వ సర్వేల పేరుతో వలంటీర్లు ప్రజలను వ్యక్తిగత వివరాలు అడుగుతున్నారని ప్రతిపక్ష నేత చంద్రబాబు అన్నారు. వాళ్లు ఇళ్లలోకి చొరబడుతున్నారని ఆరోపించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మేనిఫెస్టోలో చెప్పిన మహాశక్తి పథకాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజకీయం చేయవద్దని వలంటీర్లను కోరుతున్నట్లు చెప్పారు రాష్ట్రంలోని మహిళల స్థితిగతులను మహాశక్తి కార్యక్రమం ద్వారా మార్చేస్తానని తెలిపారు.

575 కోట్ల పెట్టుబడి 1,600 మందికి ఉపాధి

చందనవెల్లిలో 2 జపాన్ కంపెనీలకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన

- వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల నిరుద్యోగ యువతకు ప్రాధాన్యం
- జపాన్ కంపెనీల కోసం క్లస్టర్ ఏర్పాటుకు సిద్ధమని స్పష్టీకరణ

షాబాద్: రంగారెడ్డి జిల్లా చందనవెల్లిలో రూ.575 కోట్ల పెట్టుబడితో జపాన్‌కు చెందిన డైపుకు ఇంట్రాలాజిస్టిక్స్ యూనిట్‌కు, నికోమాక్ తైకిషా క్లీన్ రూమ్స్ కంపెనీ ఏర్పాటుకు శుక్రవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు కంపెనీల ద్వారా ప్రత్యక్షంగా 1,600 మందికి, పరోక్షంగా మరికొంత మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని చెప్పారు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు కంపెనీల్లో ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. ఇప్పటికే కంపెనీల యాజమాన్యం స్థానికంగా ఉన్న ఐటీఐని దత్తత తీసుకోవడం జరిగిందని, వారి అవసరాలకు తగ్గట్లు విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

రంగారెడ్డి జిల్లాలో పెట్టుబడులు అభినందనీయం

'తయారీ రంగంలో జపాన్ ప్రపంచానికే ఆదర్శం. ఆ దేశానికి వెళ్లిన ప్రతిసారీ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకుంటాను. నిజానికి అక్కడ సహజ వనరులు తక్కువ. అణుబాంబు దాడిని ఎదుర్కొని కూడా తిరిగి లేచి నిలబడింది. ఉన్న కొద్దిపాటి వనరులను ఉపయోగించుకుని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తు



శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో కాలె యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డి

ఉత్పత్తి, నాణ్యత అంశంలో అందరికంటే ముందుంది. పారిశ్రామిక ఉత్పత్తిలో తమ సత్తా చాటుకుంటోంది. ప్రస్తుతం భారతదేశంలోని ప్రతి ఒక్కరి ఇంట్లో ఏదో ఒక జపాన్ వస్తువు ఉంటుంది. అలాంటి దేశానికి చెందిన రెండు ప్రముఖ కంపెనీలు రంగారెడ్డి జిల్లాలో పెట్టుబడులు పెట్టడం అభినందనీయం..' అని కేటీఆర్ చెప్పారు.

మరిన్ని పెట్టుబడులకు సహకరించండి

'స్థానిక నాయకులు, ప్రజల చొరవతో ఇక్కడికి పెద్ద ఎత్తున కంపెనీలు వస్తున్నాయి. టెక్స్‌టైల్స్ మొదలుకొని ఎలక్ట్రిక్ వాహనాల దాకా విభిన్నమైన కంపెనీలు ఈ ప్రాంతాన్ని తమ కేంద్రంగా ఎంచుకుంటున్నాయి. రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన పారిశ్రామిక వాడగా చందనవెల్లి ఎదుగుతుంది..' అని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. జపాన్ నుంచి మరిన్ని పెట్టుబడులు వచ్చేలా సహకరించాల్సిందిగా జపాన్ కాన్సులేట్‌ను కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. జపాన్ కంపెనీల కోసం అవసరమైతే ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసేందుకు కూడా తాము సిద్ధమని అన్నారు. చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ అధ్వర్యంలో జస్టిస్ నవీన్ రావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం. చిత్రంలో జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, ఏజీ బీఎస్ ప్రసాద్, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు తదితరులు

హైకోర్టుతో 36 ఏళ్ల అనుబంధం

- ఎన్నో మధురానుభూతుల్ని మిగిల్చిందన్న జస్టిస్ నవీన్‌రావు
- తాత్కాలిక సీజే జస్టిస్ నవీన్‌రావు పదవీ విరమణ.. హైకోర్టు ఘన వీడ్కోలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టుతో తనది 36 ఏళ్ల అనుబంధమని, ఎన్నో మధురానుభూతుల్ని మిగిల్చిందని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు అన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి ఈ స్థాయికి చేరుకోగలిగానని, నీతి, నిజాయతీ, క్రమశిక్షణతో ఉంటే ఉన్నత స్థితికి చేరేందుకు ఎవ్వరూ అడ్డుకోలేరు చెప్పారు. హైకోర్టు తాత్కాలిక సీజేగా పదవీ విరమణ సందర్భంగా జస్టిస్ పి.నవీన్‌రావ పదవీవిరమణ సందర్భంగా హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. మొదటి కోర్టు హాల్లో శుక్రవారం జరిగిన ఫుల్ కోర్టు ఆయనకు వీడ్కోలు చెప్పింది. ఈ సందర్భంగా జస్టిస్ నవీన్ రావు మాట్లాడుతూ.. 'హైకోర్టు విభజన సమయంలో న్యాయమూర్తి హోదాలో జస్టిస్ శేషసాయితో కలిసి చేసిన కసరత్తు ఫలితంగా తెలంగాణ హైకోర్టు వ్యవహారాలు సామరస్యంగా కొలిక్కివచ్చాయి. బిల్డింగ్ కమిటీ చైర్మన్‌గా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేయడంతో జిల్లా కోర్టుల్లో కేసుల పరిష్కారానికి వీలైంది. జిల్లా కోర్టుల సంఖ్య పెంపు ప్రయత్నాలు ఫలించడం మంచి పరిణామం. జూనియర్ న్యాయవాదులు కష్టపడాలి' అని సూచించారు.

తెలుగులో తీర్పుతో చరిత్ర..

అంతకుముందు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి మాట్లాడుతూ.. తెలుగు, ఆంగ్ల భాషల్లో తీర్పు వెలువరించి చరిత్రకెక్కారని జస్టిస్ నవీన్‌రావును కొనియాడారు. రైతులకు న్యాయ అంశాలు వివరించే లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేయించారని తెలిపారు. అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. జస్టిస్ నవీన్‌రావు న్యాయవ్యవస్థలో సాంకేతికతను అమలు చేశారన్నారు. కోవిడ్ వేళ వరంగల్‌లో న్యాయవాదులకు సంచార వాహన సౌకర్యం, హనుమకొండలో జిల్లా కోర్టుల ప్రాంగణంలో వసతులు, కల్పతరు పేరిట ఫ్యామిలీ కోర్టులు వంటివి దేశానికే ఆదర్శంగా చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, బార్‌కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు, అదనపు సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, న్యాయవాదులు, న్యాయాధికారులు, కోర్టు సిబ్బంది, జస్టిస్ నవీన్‌రావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీసులకు పతకాలు

సాక్షి, హైదరాబాద్: ఉత్తమ సేవలందించిన పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం పతకాలు ప్రకటించింది. నూతన సంవత్సరంగా సందర్భంగా ఇవ్వాల్సిన ఈ పతకాలను దక్కించుకున్న పోలీసు, అగ్నిమాపక శాఖ, జైళ్ల శాఖల అధికారుల జాబితాను శుక్రవారం విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర శౌర్యపతకం, మహోన్నత సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, కఠిన సేవాపతకం, సేవాపతకం.. మొత్తం ఐదు కేటగిరీల్లో పతకాల విజేతల జాబితాను రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ విడుదల చేశారు.

శౌర్య పతకాలు ఎవరికంటే...

పోలీస్‌శాఖ నుంచి శౌర్య పతకాన్ని గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ పి.సతీశ్ దక్కించుకున్నారు. ఇంటెలిజెన్స్ విభాగం(కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో, స్టేట్ ఇంటెలిజెన్స్ వింగ్)కు చెందిన ఎస్సై ఎస్ఎ కరీం, ఏఎస్సై శివ శంకర్, హెడ్ కానిస్టేబుళ్లు ఎండీ ఖాజా మొయినుద్దీన్, ఎస్.రాజవర్ధన్‌రెడ్డి, ఏ. బాలాజీరావు, కానిస్టేబుళ్లు పి మోహన్, కె కిరణ్‌కుమార్, బి.లక్ష్మీ నారాయణ, బి.వీరస్వామి, ఎండీ అలీముద్దీన్‌లకు తెలంగాణ అగ్నిమాపకశాఖ నుంచి శౌర్య పతకం అందుకున్న వారిలో అసెంబ్లీ ఫైర్ స్టేషన్ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ వి.ధనుంజయ్‌రెడ్డి, సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్‌లో ఎస్ఎఫ్ఓ(స్టేషన్ ఫైర్ ఆఫీసర్)గా పనిచేస్తున్న డి. మోహన్‌రావు, గౌలిగూడ ఫైర్ స్టేషన్ ఎస్ఎఫ్ఓ ఎస్ ప్రవీణ్‌కుమార్, మొఘల్‌పుర ఫైర్ స్టేషన్ ఫైర్‌మన్ బి.వెంకటేశ్వర రాజు, గౌలిగూడ ఫైర్‌స్టేషన్ ఫైర్‌మెన్ మహ్మద్ అస్గర్, అసెంబ్లీ ఫైర్‌స్టేషన్ ఫైర్‌మన్ టి. హరికృష్ణ, సికింద్రాబాద్



ధనుంజయ్‌రెడ్డి



మోహన్‌రావు

ఫైర్‌స్టేషన్ ఫైర్‌మన్ ఎం .హరికృష్ణలకు దక్కాయి. పోలీస్ శాఖ నుంచి మహోన్నత సేవా పతకాలు 16 మందికి, ఉత్తమ సేవా పతకాలు 94 మందికి, కఠిన సేవాపతకాలు 51 మందికి, సేవా పతకాలు 473 మందికి దక్కాయి.

ఇల్లెందు ఫైర్‌స్టేషన్ డ్రైవర్‌కు మహోన్నత సేవా పతకం

మహోన్నత సేవా పతకం ఖమ్మం జిల్లా ఇల్లెందు ఫైర్‌స్టేషన్ డ్రైవర్ ఆపరేటర్ కే వెంకటేశ్వర్లుకు దక్కింది. ఉత్తమ సేవా పతకాలు ముగ్గురికి, సేవా పతకాలు 14 మందికి దక్కాయి.

ఏసీబీలో,,,

ఏసీబీలో ఉత్తమ సేవాపతకాలు వరంగల్ రేంజ్ కానిస్టేబుల్ ఏ. నర్సయ్య, నిజామాబాద్ రేంజ్ కానిస్టేబుల్ జి సురేశ్, ఖమ్మం రేంజ్ హెడ్‌కానిస్టేబుల్ టి.క్రిష్ణ సూరిలకు దక్కించుకున్నారు. సేవాపతకాలు 22 మందికి దక్కాయి. విజిలెన్స్ విభాగం నుంచి ఇన్‌స్పెక్టర్ ఎం.హుస్సేని నాయుడు, కానిస్టేబుల్ ఎంఏ మసూద్‌లకు దక్కగా, సేవాపతకాలు ఇన్‌స్పెక్టర్ దండిక మహేశ్, కానిస్టేబుల్ డి.రాజేశ్‌కుమార్ దక్కించుకున్నారు.

ఎస్పీఎఫ్‌లో..

స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు చెందిన వారిలో సబ్ ఇన్‌స్పెక్టర్ డి. తిరుపతిరెడ్డికి మహోన్నత సేవా పతకం దక్కింది. ఉత్తమ సేవా పతకాలు ముగ్గురికి, సేవాపతకాలు 15 మందికి దక్కాయి. కాగా, పతకాల జాబితా ఆరు నెలలు ఆలస్యం కావడంపై సిబ్బందిలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అయితే, ఆలస్యంగానైనా పతకాలు దక్కినందుకు ఒకింత సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టుకు మరో ముగ్గురు న్యాయమూర్తులు

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టుకు మరో ముగ్గురు న్యాయమూర్తులను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం బుధవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసు చేసిన జాబితాలో న్యాయాధికారి సుజన కళాసికం, న్యాయవాదులు లక్ష్మీనారాయణ అలిశెట్టి, అనిల్‌కుమార్ జూకంటి పేర్లు ఉన్నాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ కౌశల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం చేసిన సిఫారసులను కేంద్రం ఆమోదించి రాష్ట్రపతికి నివేదించాల్సి ఉంటుంది. రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే ఈ ముగ్గురూ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులవుతారు. వీరి పేర్లకు రాష్ట్ర గవర్నర్, సీఎం గతంలోనే ఆమోదం తెలిపారు.

అలిశెట్టి లక్ష్మీనారాయణ: నిజామాబాద్ జిల్లా మెండోరా గ్రామంలో హెడ్మాస్టర్ గంగాధర్, రాజుబాయ్ దంపతులకు 1968 మే 13న లక్ష్మీనారాయణ జన్మించారు. నిజామాబాద్ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, కాకతీయ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1994లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేయించుకున్నారు. రాజ్యాంగ, 'సివిల్ లా'లో నైపుణ్యం సాధించారు. ఆయన జాతీయ రహదారుల అభివృద్ధి అథారిటీ, ఎన్‌బీసీసీ, ఓరియంటల్ లైఫ్ ఇన్సూరెన్స్‌తోపాటు పలు ఎల్పీసీ, బ్యాంకులకు స్టాండింగ్ కౌన్సిల్‌గా ఉన్నారు.

కె.సుజన: నల్లగొండ జిల్లా ఆలేరుకు చెందిన మధుసూదన్, ప్రమీల దంపతులకు కె.సుజన 1970 మార్చి 10న జన్మించారు. 1997లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. 2010లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. జూనియర్ సివిల్ జడ్జిగా కొనసాగుతూనే 2012లో జిల్లా జడ్జి పరీక్షలు రాసి ఎంపికయ్యారు. కరీంనగర్ అదనపు జిల్లా జడ్జిగా, నిజామాబాద్ జిల్లా జడ్జిగా, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగాను, జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా పనిచేశారు. గతేడాది నుంచి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా సుజన విధులు నిర్వర్తిస్తున్నారు.

జిల్లా వార్తలు

ఆయిల్‌పామ్ రైతుల సమస్యలపై దృష్టి సారించండి



మంత్రి నిరంజన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జోగేశ్వరరావు

దమ్మపేట: ఆయిల్‌పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని ఆయిల్‌పామ్ అడ్వైజరీ కమిటీ బాధ్యులు, రైతులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లో మంత్రికి శుక్రవారం వారు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. పంటకు మద్దతు ధర పడిపోతున్న నేపథ్యాన రైతులను ఆదుకోవాలన్నారు. ఇతర సమస్యలపై కూడా విన్నవించగా పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ఆయిల్‌పామ్ అడ్వైజరీ కమిటీ బోర్డు మెంబర్ రావు జోగేశ్వరరావుతో పాటు కొక్కెరపాటి పుల్లయ్య, తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి, నడిపల్లి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ఇన్‌చార్జి డీఎంఓగా అలీం



ఎం.ఏ.అలీం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీంను అదనపు బాధ్యతలతో నియమించారు. ఈమేరకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం కె. నాగరాజు ఇన్‌చార్జి మార్కెటింగ్ శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించగా ఆయనను సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జ్ డీఎంఓగా నియమించారు.

'102' డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్/కొత్తగూడెం టౌన్: ఈఎంఆర్ఐ సంస్థ పరిధిలోని 102 వాహనాలకు డ్రైవర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ తెలిపారు. ఎస్సెస్సీ ఉత్తీర్ణులై ఎల్ఎంవీ బ్యాడ్జి, డ్రైవింగ్‌లో కనీసం మూడేళ్ల అనుభవం ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఈనెల 16న కొత్తగూడెం రామవరంలోని ఎంసీహెచ్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు అన్ని సర్టిఫికెట్ల ఒరిజినల్స్, జిరాక్స్‌లతో హాజరు కావాలని సూచించారు.

అల్లికల మల్లికలు!

మహిళలు సహజంగా కుట్లు, అల్లికల్లో సిద్ధహస్తులే అయి ఉంటారు! అయితే, ఇవి దుస్తులు కుట్టడం, స్వెటర్లు లేదంటే, బుట్టల అల్లకమే అయి ఉంటుంది. కానీ మీరు ఓసారి జిల్లాలోని కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వెళ్లి చూస్తే ఆశ్చర్యపోక తప్పదు!! ఎందుకంటారా? పాలేరు రిజర్వాయర్ ఆధారంగా జీవనం సాగించే ఇక్కడి మత్స్యకార మహిళలు చేపల వేటకు అవసరమైన వలల తయారీలో ప్రసిద్ధిగాంచారు. కొంత సాంకేతికత.. మరికొంత యంత్ర పరిజ్ఞానం అందిస్తే ఆకాశాన్నంటేలా ప్రతిభ చాటుతామని వీరు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి, ఖమ్మం డెస్క్





సిద్ధమైన వలతో మహిళలు (ఇన్‌సెట్) చేపల వలల తయారీలో నిమగ్నమైన నాయకన్‌గూడెం మహిళలు

చేపల వలల తయారీలో నాయకన్‌గూడెం మహిళల సత్తా

- ఇక్కడి నుంచే రాష్ట్రంలోని పలు జిల్లాలకు సరఫరా
- నైపుణ్యం ఉన్నా ఆదాయం మాత్రం అంతంత మాత్రమే
- సాంకేతిక, యంత్ర పరిజ్ఞానం జోడిస్తే మరింత ముందడుగు

కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్ చేపల పెంపకానికి ప్రసిద్ధి. దీనికి సమీపాన ఉన్న నాయకన్‌గూడెంలో వందలాది కుటుంబాలు చేపల పెంపకం, వేట, అమ్మకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆయా కుటుంబాల్లో మహిళలు చేపల షికారుకు అవసరమయ్యే వలల తయారీలో పేరు గాంచారు. తొలుత పురుషులే వలల తయారీ, మరమ్మతులు చేసుకోగా ఆసక్తిగా కొందరు మహిళలు సైతం నేర్చుకోవడంతో నైపుణ్యం ఆధారంగా 2008లో 52మంది మత్స్యకార మహిళలతో సహకార సంఘాన్ని ఏర్పాటు చేశారు. కాలక్రమంలో మహిళల సంఖ్య పెరగడంతో ప్రస్తుతం 100 మంది మహిళలతో రెండు సహకార సంఘాలను నిర్వహిస్తున్నారు.

పని ఉంటే రోజుకు రూ.450

0–20 నంబర్ వల తయారయ్యాక సుమారు కిలో బరువు ఉంటుంది. ఈ వల తయారు చేయడానికి రూ.1,500 విలువైన దారాలు, సీసం అవసరమవుతుండగా.. ఒక్కో మహిళ రోజుకు ఈ వల సునాయంగా తయారు చేస్తారు. దీనిని రూ.1,950కు విక్రయిస్తే రూ.450 ఆదాయం వస్తుంది. అదే నలుగురు బృందంగా రోజుకు ఆరు కిలోల బరువు కలిగిన వల తయారు చేస్తారు. ఇందుకు రూ.9 వేల వరకు వెచ్చిస్తే... అమ్మాక ఒక్కొక్కరికి రూ.675 వరకు ఆదాయం సమకూరుతుంది. అయితే, వలల తయారీలో నాయకన్‌గూడెం మహిళలకు నైపుణ్యం ఉన్నా ప్రతిఫలం లభించడం లేదనే చెప్పాలి. వలలను సహజంగా జనవరి మొదలు జూన్ వరకు తయారు చేస్తారు. మిగతా సీజన్‌లో పని పెద్దగా ఉండదు. కాగా, ఇక్కడ చేసిన వలలను ఖమ్మం జిల్లాలోని మత్స్యకారులతో పాటు మెదక్, నల్లగొండ, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర ఉమ్మడి జిల్లాల మత్స్యకారులు సైతం ఆర్డర్లపై కొనుగోలు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు కూడా మెటీరియల్ ఇచ్చి వలలు తయారు చేయిస్తారు.

కుటీర పరిశ్రమగా..

చేతివృత్తిగా వలలు తయారీ చేస్తున్న మహిళలకు సాంకేతిక, యంత్ర పరిజ్ఞానాన్ని సమకూరిస్తే పొరుగు రాష్ట్రాలకు కూడా వలలు సరఫరా చేయగలిగే సామర్థ్యం ఉంది. కానీ ప్రభుత్వ ప్రోత్సాహకాలు అంతగా లేవని చెబుతారు. ప్రభుత్వం వలల తయారీని చేతివృత్తిగా గుర్తించి ప్రోత్సాహకంగా రుణాలు ఇస్తే జీవనోపాధి మెరుగుపడుతుంది. నాయకన్‌గూడెంలో మత్స్యకారులు చేపల పెంపకం, వేటపై జీవనం సాగిస్తుండగా.. మహిళలు కుటీర పరిశ్రమగా వలలు తయారు చేస్తున్నారు. అయితే, జలాశయాల్లో నీరు అడుగంటినా, కరువు పరిస్థితులు ఎదురైనా భార్యాభర్తలకు ఉపాధి లేక ఇబ్బందికరంగా ఉంటోంది.

చేప చిక్కాల్సిందే...

గతంలో నైలాన్ దారంతో వలలను తయారు చేసేవారు. ఆ స్థానంలో ఇప్పుడు ప్లాస్టిక్ దారాలు వచ్చాయి. చేపలు పట్టేందుకు మూడు రకాల వలలు ఉండగా.. ఇందులో కచ్చు వలలనే ఎక్కువగా మత్స్యకారులు వినియోగిస్తారు. వంద గ్రాముల చేప మొదలు 20 కిలోల చేపలను పట్టేలా వలలను సిద్ధం చేస్తుండగా... వీటికి ప్రత్యేక నంబర్లు ఉంటాయి. వలల తయారీలో ప్లాస్టిక్ వైర్, నైలాన్ దారంతోపాటు వల నీటిలో మునిగేందుకు సీసం (లెడ్) ఉపయోగిస్తారు.

పరిశ్రమగా గుర్తిస్తే మాకు మేలు...



వలల తయారీని పరిశ్రమగా గుర్తించి అభివృద్ధి చేయాలి. చేతివృత్తిగానే వలలు తయారు చేస్తున్నాం. మత్స్యరంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నా వలల తయారీ రంగాన్ని విస్మరించింది. ప్రభుత్వం చేయూతనిస్తే అన్ని రకాల వలలను తయారుచేస్తాం.

– నిమ్మరబోయిన గాయత్రి, నాయకన్‌గూడెం

నైపుణ్యం ఉన్నా కూలి జీవనమే..



15 ఏళ్లకు పైగా వలలు తయారు చేస్తున్నాం. అయితే, సీజన్‌లో కూడా రోజుకు రూ.450కు మించి కూలీ లభించడం లేదు. దీంతో నైపుణ్యం ఉన్న మాకంటే అమ్మకందారులకే లాభం వస్తోంది. ఇకనైనా ప్రభుత్వం మా జీవనోపాధి మెరుగుపడేలా మార్గం చూపాలి.

– పోలిశెట్టి పోశమ్మ, నాయకన్‌గూడెం

ప్రభుత్వ పథకాల ద్వారా చేయూత



నాయకన్‌గూడెం మత్స్యకార మహిళలు రాష్ట్ర నలుమూలలకు వలలు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా వారిని ప్రోత్సహించేందుకు కృషి చేస్తాం. పూర్తిగా అధ్యయనం చేసి యంత్రాలను అందుబాటులో తీసుకురావాలనే ఆలోచన ఉంది.

– డి.ఆంజనేయస్వామి, మత్స్యశాఖ అధికారి, ఖమ్మం జిల్లా

గిరిజన వసతిగృహాలకు నాణ్యమైన సరుకులు

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం సిద్ధం చేసేందుకు నాణ్యమైన సరుకులను కమిటీ ద్వారా ఎంపిక చేస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ (జనరల్), ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజ్ తెలిపారు. పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం, పప్పులు, నూనె తదితర సామగ్రిని జీసీసీ డీఎం, ఫుడ్ క్వాలిటీ కమిటీ సభ్యుల సమక్షాన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు సరఫరా చేసే ప్రతీ వస్తువును నిశితంగా పరిశీలించాకే పాఠశాలలకు చేరవేస్తున్నట్లు తెలిపారు. చింతపండు, జీలకర్ర నాసిరకంగా ఉండడంతో తిరస్కరించామని చెప్పారు. సంబంధిత జీసీసీ మేనేజర్లు విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం విజయ్‌కుమార్, అధికారులు, ప్రిన్సిపాళ్లు రమణయ్య, నర్సింహారావు, చంద్రమోహన్, దేవదాస్, నర్సింగరావు, దావీదు, లక్ష్మి, అనిత, కబీర్ తదితరులు పాల్గొన్నారు.



సామగ్రిని పరిశీలిస్తున్న ఏపీఓ డేవిడ్‌రాజ్, కమిటీ సభ్యులు

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ తీరును ప్రజలకు వివరిస్తాం..

- ఈనెల 29న అమిత్‌షా వచ్చే అవకాశం
- మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ఖమ్మంమామిళ్లగూడెం: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మ్యాచ్ ఫిక్సింగ్ అయిన తీరును ప్రజలకు వివరిస్తామని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యాన మరోమారు బంగారు తెలంగాణ పేరిట ఓట్ల కోసం తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌తో కుమ్మక్కైన బీఆర్‌ఎస్ నేతలు.. ఏదో విధంగా బదనాం చేయాలని కుట్ర పన్నారని పేర్కొన్నారు. కాగా, ఈ నెల 29న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సభ ఖమ్మంలో ఉండే అవకాశముందని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అమెరికా నుంచి వచ్చాక పూర్తి సమాచారం తెలుస్తుందని చెప్పారు. ఈ నెల 16న వెలుగుమట్ల అర్బన్ పార్కులో నిర్వహిస్తున్న సామూహిక వనభోజనాలను విజయవంతం చేయాలని సుధాకర్‌రెడ్డి కోరారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి, పక్కన సత్యనారాయణ తదితరులు

గంజాయి అక్రమ రవాణాను అరికట్టండి

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలను అడ్డుకోవాలని పొంగులేటి సుధాకర్‌రెడ్డి, గల్లా సత్యనారాయణ తదితరులు సీపీ విష్ణు ఎస్.వారియర్‌ను కోరారు. వారు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డితో పాటు నాయకులు దొంగల సత్యనారాయణ, గెంటెల విద్యాసాగర్, శ్యాంరాథోడ్, నున్నా రవికుమార్, మందా సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, నూకల రామ్మోహన్‌రెడ్డి, అల్లిక అంజయ్య, ఉపేందర్‌గౌడ్, సుదర్శన్, దొడ్డా అరుణ, అనిత, దీకొండ శ్యామ్, శంకర్‌గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం గాంధీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన రూ.20 వేల విలువైన 500 పేట్లు, గ్లాసులను లయన్స్ క్లబ్ ప్రతినిధులు శుక్రవారం అందజేశారు. అమెరికాలోని బోస్టన్‌లో లయన్స్ క్లబ్ గవర్నర్‌గా సీహెచ్ శివప్రసాద్ బాధ్యతలు స్వీకరించి స్వదేశానికి వచ్చిన సందర్భంగా వీటిని అందజేసినట్లు క్లబ్ బాధ్యులు తెలిపారు. ఖమ్మం లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ మురళీధర్‌రావు, పాఠశాల హెచ్‌ఎం రుక్మాందర్‌రావు, క్లబ్ అధ్యక్షుడు తల్లపురెడ్డి కృష్ణారెడ్డితో పాటు హన్మంతరావు, జనార్దన్‌రావు, కె.గోపాల్‌రావు, విశ్వేశ్వరరావు, నవీన్, దుర్గానాగేశ్వరరావు, సాంబశివరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, ఆర్తి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు